సాక్షి జగిత్యాల

మంగళవారం । 11 । జూన్ । 2024



భయం..భయం

ఇసుకాసురుల ధనదాహానికి సామాన్యులు బలవుతున్నారు. ఎక్కువ ట్రిప్పులు తరలించాలన్న దురాశతో అతివేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. - 8లో



రంగు మారిన బియ్యం పంపిణీ

ఉమ్మడి మేడిపల్లి మండలవ్యాప్తంగా నాసిరకం రేషన్ బియ్యం పంపిణీతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

- ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- కలెక్టర్ యాస్మిన్‌బాషా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వసతులు కల్పించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు వెంటనే అందేలా చూడాలని, అలాగే వసతి గృహాలన్నింటినీ శుభ్రం చేయించాలని సూచించారు. గతేడాది పాఠశాలలు ముగింపు సమయంలో మిగిలిపోయిన బియ్యం, తదితర సామగ్రి ఉపయోగించొద్దని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ రానీయొద్దన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలను వెంటనే మరమ్మతు చేయించాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌ను ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో పూర్తిగా నిషేధించాలని, దీనిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. రైతులు ఇబ్బందులు పడొద్దని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర పాల్గొన్నారు.

బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. పండగ పూట వదంతులు నమ్మకూడదన్నారు. స్లాటర్ హౌస్‌లోనే జంతువధ చేయాలని, పశుసంవర్ధక శాఖ అధికారులు జారీ చేసిన పశువులను మాత్రమే వధించాలని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో శానిటేషన్‌ను ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. ధర్మపురిలో తాత్కాలిక స్లాటర్ హౌస్ ఏర్పాటుకు కమిషనర్‌తో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, పోలీసు అధికారులను సంప్రదించాలన్నారు. ఆవులను వధించబోమని మతపెద్దలు తెలిపారు. డాక్టర్ సర్టిఫికెట్ ఇచ్చిన వాటినే వధిస్తామన్నారు. వెటర్నరీ సహాయ సంచాలకులు నరేశ్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా ట్రాన్స్‌కో అధికారి వంశీధర్, మైనార్టీ సంక్షేమాధికారి చిత్రు, డీఎంవో ప్రకాశ్ పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని మినీ గురుకులం, ఒడ్డెలింగాపూర్, మల్లాపూర్‌లోని పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 1, 2, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల సమన్వయ అధికారి వెంకన్న తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఒకటో తరగతిలో 60, రెండో తరగతిలో 10, ఐదో తరగతిలో 25 సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, విద్యార్థినుల తల్లిదండ్రులు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 63007 94868 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కొండగట్టు అంజన్నకు కమలాలతో పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో స్థానిక బీజేపీ నాయకులు సోమవారం కమలాలతో పూజలు నిర్వహించారు. దేశంలో మూడో సారి మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలవడంతో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గాజుల మల్లేశం, సంఘని రవి, నాయకులు చక్రం గౌడ్, ఆనందం పాల్గొన్నారు.

బండికి హోంశాఖ

- సహాయ మంత్రిగా ఎంపీ సంజయ్‌కుమార్‌కు అవకాశం
- 24 ఏళ్ల తర్వాత కరీంనగర్‌కు దక్కిన అవకాశం
- గతంలో చెన్నమనేని విద్యాసాగర్ రావుకు ఇదే శాఖ కేటాయింపు
- సంబరాల్లో మునిగితేలిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ సోమవారం సాయంత్రం విడుదల చేసిన కేంద్ర మంత్రుల జాబితాలో ఆయనకు పదవి ఖరారైంది. ఆదివారం సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆయనకు ఈ శాఖను కేటాయించడంతో 24 ఏళ్ల తర్వాత కరీంనగర్‌కు మళ్లీ అదే శాఖ దక్కినట్లయింది. 1999లో కరీంనగర్ ఎంపీగా గెలిచిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి ప్రధాని వాజ్‌పేయి కేబినేట్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. తర్వాత 2019లో కిషన్‌రెడ్డికి సైతం ఇదే పదవి వచ్చింది. ఇప్పుడు సంజయ్‌కి హోంశాఖ సహాయమంత్రి ఇవ్వడంతో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

ఇకపై పటిష్ట భద్రత

ఇప్పటివరకు ఎంపీ సంజయ్‌కుమార్‌ని ఎప్పుడు కావాలంటే అప్పుడు కలిసే వీలుండేది. ఆయన కేంద్ర సహాయ మంత్రి అయినప్పటికీ.. నేరుగా కలిసే వీలుంటుందని అంతా అనుకున్నారు. కానీ, అనూహ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిత్వ శాఖను కేటాయించడంతో సహచరులు, అభిమానులు కాస్త డీలా పడ్డారు. ఈ శాఖ వల్ల ముందస్తు అపాయింట్‌మెంట్, తనిఖీలు లేకుండా ఎంపీ సంజయ్‌ని కలువడం సాధ్యం కాదు. ఇకపై ఆయన పటిష్ట భద్రత, నిఘా మధ్యనే తన పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

ఎంపీగా పోలీసులతో తలపడ్డారు..

2019లో సంజయ్‌కుమార్ తొలిసారి ఎంపీగా గెలిచారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌పై పోరులో భాగంగా ఆయన ఎక్కువసార్లు పోలీసులతోనే తలపడాల్సి వచ్చింది. దుబ్బాక ఎన్నిక సమయంలో సిద్దిపేట సీపీ జోయల్ డేవిస్, జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో అప్పటి సీపీ అంజనీ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో అప్పటి సీపీ సత్యనారాయణ, పదోతరగతి ప్రశ్నపత్రం లీకేజీ సమయంలో అప్పటి వరంగల్ సీపీ రంగనాథ్, కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడితో మాటల యుద్ధం కొనసాగించారు. సీపీ సత్యనారాయణతోపాటు పలువురు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలపై పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు కూడా చేశారు. అలాంటిది ఇప్పుడు వారి శాఖకే కేంద్ర సహాయ మంత్రిగా రావడం చర్చనీయాంశంగా మారింది.

ఫోన్ ట్యాపింగ్ విషయంలో సీరియస్

ఇటీవల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రిటైర్డ్ పోలీసు అధికారి ప్రభాకర్‌రావు పైనా సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం సంజయ్‌కి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి రావడంతో గత ప్రభుత్వంలో ఆయనపై నిఘా ఉంచిన పోలీసు అధికారుల్లో అభద్రతాభావం నెలకొంది. తనతోపాటు కుటుంబసభ్యులు, సిబ్బందిపై అనధికారికంగా నిఘా ఉంచి, వ్యక్తిగత కాల్స్‌ను చాటుగా విన్న విషయంపై బండి ఇప్పటికీ గుర్రుగానే ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తప్పకుండా ఆయన ప్రభుత్వాన్ని నివేదిక కోరే అవకాశం ఉందని అనుచరులు వ్యాఖ్యానించడం కరీంనగర్ పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

'ప్రజావాణి'కి బారులు



బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, ఇతర అధికారులు

- జిల్లావ్యాప్తంగా సమస్యలతో తరలివచ్చిన బాధితులు
- నెల రోజులకుపైగా నిలిచిపోయిన కార్యక్రమం
- భూ సమస్యలు, పింఛన్ల అర్జీలే అధికం

జగిత్యాల: పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం పునఃప్రారంభించడంతో జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ యాస్మిన్ బాషా, ఇతర అధికారులు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో ఎక్కువగా భూ సమస్యలు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి. చాలారోజుల తర్వాత బాధితులు కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున తరలిరావడంతో కలెక్టరేట్ కళకళలాడింది. మొత్తం 48మంది వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఉన్నతాధికారులను ఆదేశించారు.



బాధితులతో కిక్కిరిసిపోయిన కలెక్టరేట్

ఇంటి స్థలాన్ని ఆక్రమించారు



నాకు జగిత్యాలలో హౌస్ నంబరు 5–2–23, 6–2–23 విస్తీర్ణంలో ఇంటి స్థలం ఉంది. మున్సిపల్ అధికారులు నా స్థలాన్ని కొమురయ్య, మల్లయ్య అనే వ్యక్తుల పేరిట అక్రమంగా రికార్డుల్లో మార్చారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అధికారులు స్పందించి నా ఇంటి స్థలాన్ని నాకు ఇప్పించాలి. – కొత్త దేవేంద్ర, జగిత్యాల

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం



కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని జగిత్యాలకు చెందిన మహేశ్ అనే వ్యక్తి డబ్బులు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించలేదు. నాతోపాటు, లక్ష్మీ, గణేశ్ నుంచి రూ.2.60 లక్షలు తీసుకున్నారు. ఏడు నెలలుగా అడుగుతున్నా ఇవ్వడం లేదు. మాకు న్యాయం చేయాలి.

– తోకల రాధ, జగిత్యాల

చేపలు దొంగిలించారు



పెగడపల్లి మండలం అయితిపల్లి గ్రామ పరిధిలోని ర్యాలచెరువులో నందగిరి గ్రామానికి చెందిన కొందరు చేపలు పట్టుకుంటున్నారు. ఈ చెరువులో మత్స్య పారిశ్రామిక సంఘం అయితిపల్లి వారికే పూర్తి హక్కు ఉంది. అక్రమంగా చేపలు పట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– అయితిపల్లి గ్రామస్తులు, పెగడపల్లి మండలం

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



జిల్లా కేంద్రంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. వ్యవసాయ మార్కెట్‌లో సమీకృత మార్కెట్ ప్రారంభించినా వినియోగంలోకి రాలేదు. డబుల్‌బెడ్‌రూంలు నిరుపయోగంగానే ఉన్నాయి. లింగం చెరువు వద్ద శ్మశాన వాటిక పూర్తిగా నిర్మాణం కాకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు.

– అరుముల్ల పవన్, సామాజిక కార్యకర్త

చర్చికి అనుమతి రద్దు చేయాలి



జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో హౌస్‌నంబరు 4–4–262 నంబరు గల స్థలంలో సొసైటీ ఆఫ్ ట్రస్టీస్ వారు కొనుగోలు చేసి కొత్తగా ట్రస్టీ వారు చర్చి బిల్డింగ్ నిర్మాణం చేపడుతున్నారు. గృహ నివాసాల్లో ఉన్న ఈ చర్చి నిర్మాణానికి అనుమతులు రద్దు చేయాలి.

– 11వ వార్డు కాలనీవాసులు

జగిత్యాల టు గోవా

- మకాం మార్చిన పేకాట నిర్వాహకులు
- అక్కడి క్లబ్‌లను రోజు చొప్పున లీజుకు..
- వారానికి రూ.25 లక్షలు చెల్లింపు



కోరుట్ల: అడవులు.. తోటలు.. వాగులు..వంకలు ఇలా ఎక్కడపడితే అక్కడ పేకాటకు అడ్డాలు ఏర్పాటు చేసి మరీ మూడుముక్కలాట ఆడిస్తున్న నిర్వాహకులు పోలీసుల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఫలితంగా కొత్తదారులు వెతుక్కుంటున్నారు. నిన్నామొన్నటి దాకా ఆదిలాబాద్, నిజామాబాద్ మహారాష్ట్ర సరిహద్దుల్లో పేకాట శిబిరాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు అక్కడ పరిస్థితులు సరిగా లేకపోవడంతో మళ్లీ మకాం మార్చేశారు. మూడు ముక్కలాటకు ఎలాంటి సమస్యలూ లేకుండా గోవాలోని క్యాసినో క్లబ్‌లను రోజు లెక్కన లీజుకు తీసుకుంటున్నారు. జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, నిర్మల్, కామారెడ్డి ఏరియాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది పేకాటరాయుళ్లను కార్లల్లో గోవాకు తరలించి మరీ సొమ్ము చేసుకుంటున్నారు.

వారానికి రూ.25 లక్షలు

జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ ఏరియాలకు చెందిన కొంతమంది పేకాట నిర్వాహకులు గోవాలోని క్యాసినో క్లబ్‌లలో మూడు రోజులపాటు మూడుముక్కలాట ఆడటానికి రూ.25 లక్షలు చెల్లించి లీజుకు తీసుకుంటున్నారు. ఆ క్లబ్‌కు లీజు డబ్బులు చెల్లిస్తే చాలు నిర్వాహకులు పేకాట ఆడేందుకు వచ్చిన వారికి మూడురోజులపాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు సమాచారం. మందు, విందు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి వెళ్లిన పేకాటరాయుళ్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పేకాట ఆడేవారి డబ్బులు కూడా నిర్వాహకులకే చెందేలా క్యాసినో క్లబ్‌లతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ క్లబ్‌లో త్రీకార్డ్స్, రమ్మీ ఆడేందుకు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

జేబులు నింపుకుంటున్నారు..

ఇక్కడి నుంచి గోవా వెళ్లి క్లబ్‌లో పేకాడుతున్న వారు లక్షల్లో డబ్బులు నష్టపోతుండగా.. క్లబ్‌లు లీజుకు తీసుకుంటున్న నిర్వాహకులు మాత్రం జోరుగా జేబులు నింపుకుంటున్నారు. ఒక్కో టేబుల్‌కు 9 మంది చొప్పున ఒక్కో రౌండ్‌కు రూ.50వేలు, రూ.25వేల చొప్పున రమ్మీతో పాటు మూడుముక్కలాట ఆడుతున్నారు. ఒక్కోరౌండ్‌కు ఒక్కో టేబుల్‌కు రూ.50వేలు, రూ.25వేలు క్లబ్‌లను లీజుకు తీసుకున్న ఈ ప్రాంతంలోని నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన రోజుకు సుమారు 6 నుంచి 8 టేబుళ్ల లెక్కన పదిహేను రౌండ్లు ఆట సాగితే ఎంత తక్కువ అనుకున్నా రోజుకు రూ.20లక్షల వరకు వసూలయ్యే అవకాశం ఉంది. ఇలా మూడు రోజులకు క్యాసినో క్లబ్ నిర్వాహకులకు చెల్లించే లీజు డబ్బులు పోనూ రూ.10 లక్షల వరకు నిర్వాహకులు జేబులో వేసుకుంటున్నారు.

ఏజెంట్లతో తరలింపు

గోవా క్యాసినో క్లబ్‌ల్లో పేకాట ఆడేందుకు జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, నిర్మల్, కామారెడ్డి, ఆదిలాబాద్, సిరిసిల్ల ఏరియాల్లో లీజుకు తీసుకున్న వారు కమీషన్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరికి కార్లు లేదా విమానం టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించి కనీసం రూ.2లక్షల నుంచి రూ.5లక్షలు వెంట తీసుకొచ్చే వారిని పేకాట ఆడేందుకు గోవా తరలించాలని చెబుతున్నారు. ఇలా ప్రతిరోజూ ఆయా ప్రాంతాల నుంచి సుమారు 150 నుంచి 200 మంది గోవాకు కార్లు, విమానాల్లో వెళ్లి పేకాట ఆడుతూ తీవ్రంగా నష్టపోతున్నారు. పేకాటరాయుళ్లను గోవాకు తరలించే ఏజెంట్లకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున కమీషన్ ఇవ్వడంతోపాటు కారు అద్దె కూడా చెల్లిస్తున్నట్లు సమాచారం. స్థానికంగా పేకాటను నియంత్రించడంపై దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం.. గోవాలో క్యాసినో క్లబ్‌లను లీజుకు తీసుకుని మూడు ముక్కలాట ఆడిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటే పేకాట వ్యసనంలో బజారుపాలవుతున్న కుటుంబాలకు కొంత మేలు జరుగుతుందన్న అభిప్రాయాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

అడ్డం తిరిగిన భూకబ్జా

- భూకబ్జాకు యత్నించిన ముగ్గురి అరెస్ట్
- పరారీలో జగిత్యాల కమిషనర్, మరో వ్యక్తి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని హస్నాబాద్ శివారులోని భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన ఐదుగురిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. సోమవారం ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సీఐ వేణుగోపాల్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రం శివారు సర్వేనంబరు 1599లో 12 గుంటల భూమిని కీర్తి విజయలక్ష్మి, పూటూరి గీతారాణి, సత్యనారాయణ కొనుగోలు చేశారు. ఆ భూమికి పూర్తి హక్కుదారులుగా కూడా ఉన్నారు. ఆ భూమిని కబ్జా చేయాలనే ఉద్దేశంతో జగిత్యాలకే చెందిన ఖాజా అమిరోద్దీన్, ఎండీ.ముజాకిర్, ఇమ్రాన్ పన్నాగం పన్నారు. ఇందుకోసం సదరు భూమికి సాదాబైనామా, నకిలీ రికార్డులు, 13 బీ, 13 సీ మ్యాప్‌లు సృష్టించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్వో బడుగు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అనిల్ సహకారం తీసుకున్నారు. భూకబ్జా చేసే సదరు ఖాళీ స్థలానికి నకిలీ ఇంటినంబరు, నకిలీ అసెస్మెంట్ పత్రాలు సృష్టించారు. నకిలీ ఇంటి నంబరుపై 2012 అక్టోబర్ నుంచి 2023 మార్చి 31వరకు వెకెండ్ ల్యాండ్‌టాక్స్ (వీఎల్టీ) రూ.97,500ను 03–05–2024న చెల్లించి భూకబ్జాకు యత్నించారు. నకిలీ డాక్యుమెంట్లతో భూమికి హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న సదరు భూ యజమానులు వారిని అడ్డుకున్నారు. ఆ భూమిపై తమకే హక్కులు ఉన్నాయని, వీఎల్టీ నంబరు కూడా వచ్చిందని అసలైన యజమానులను బెదిరించారు. దీంతో అసలు యజమానులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి భూ కబ్జాకు ఖాజా అమిరోద్దీన్, ముజాకిర్ అలీ, మున్సిపల్ ఉద్యోగి ప్రసాద్, ఇమ్రాన్, కమిషనర్ అనిల్ ప్రయత్నించారని తేల్చారు. సోమవారం ఖాజా అమిరోద్దీన్, ముజాకిర్ అలీ, మున్సిపల్ ఉద్యోగి ప్రసాద్‌ను అరెస్ట్ చేసి జగిత్యాల కోర్టుకు పంపారు. ఇదే కేసులో నిందితులైన ఇమ్రాన్, మున్సిపల్ కమిషనర్ అనిల్ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

రేపు జిల్లాకు విదేశాల నుంచి శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో (ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా) ఈనెల 12న ఆయిల్ పాం పెంపకంపై జరిగే సదస్సుకు ఫ్రాన్స్, మలేషియా, ఇండోనేషియా దేశాల శాస్త్రవేత్తలు రానున్నారు. ఆయా దేశాల శాస్త్రవేత్తలు రాష్ట్రంలో సాగవుతున్న ఆయిల్ పాం తోటలను పరిశీలించేందుకు రానుండగా.. రాష్ట్రంలోనే సుమారు నాలుగు వేల ఎకరాల్లో సాగు చేసిన జిల్లాను రాష్ట్ర ఉద్యానశాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయా దేశాల శాస్త్రవేత్తలు జిల్లాలో సాగవుతున్న ఆయిల్ పాం తోటలను పరిశీలించనున్నారు. రైతులతో మాట్లాడి పంట, సాగు వివరాలు, మార్కెటింగ్‌పై చర్చించనున్నారు. విదేశాల నుంచి శాస్త్రవేత్తలు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ తెలిపారు.

క్షయ నిర్మూలనకు బీసీజీ టీకా

- పూర్తయిన శిక్షణ
- త్వరలో ఇంటింటి సర్వే
- ఆగస్టులో వ్యాక్సినేషన్

రాయికల్(జగిత్యాల): క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది. పెద్దలకు బీసీజీ టీకా వేయడానికి ప్రణాళిక పూర్తి చేసింది. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 17 జిల్లాల్లో పెద్దలకు బీసీజీ టీకా వేయడానికి సన్నాహాలు చేస్తుండగా.. ఇందులో జిల్లా కూడా ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే జిల్లాస్థాయిలో మండల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశారు. అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి అర్హుల గుర్తింపునకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఏటా రెండు వేల మంది టీబీ బారిన పడుతున్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పరీక్షల్లో వ్యాధి లక్షణాలు ఎక్కువగా ఉన్న రోగుల తెమడ నమూనాలు సేకరించి సీబీనాట్, హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఇలాంటి వారు ప్రస్తుతం జిల్లాలో 60మంది డీఆర్‌టీబీ బారిన పడినట్లు గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. సాధారణ టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలు, డీఆర్ టీబీ గ్రస్తులకు 9 నుంచి రెండేళ్లపాటు ఉచితంగా మందులు, అందించడంతోపాటు పోషణ భత్యం కింద డీబీటీ సిస్టం ద్వారా ప్రతినెలా రూ.500 అందిస్తున్నారు.

టీకాతో ఇమ్యూనిటీ

సాధారణంగా దగ్గు ద్వారా ఇతరులకు వ్యాపించే అవకాశం ఉన్న క్షయ నిర్మూలనకు పుట్టిన ప్రతి పిల్లలకు వెంటనే బీసీజీ టీకా వేస్తారు. ప్రస్తుతం పెద్దలకు వేసే ఈ బీసీజీ టీకాతో ఇమ్యూనిటీ పెరగడంతోపాటు క్షయ రాకుండా ఉపయోగపడుతుంది. టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్యశాఖ ఇంటింటి సర్వే చేపట్టనుంది. రోగులను గుర్తించిన అనంతరం వచ్చే ఆగస్టులో బాధితులకు టీకా వేయనున్నారు.





బీసీజీ టీకా, టీకాపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

పెద్దల బీసీజీ టీకాకు అర్హులు వీరే

- 18 ఏళ్లు నిండి ఉండాలి.
- క్షయవ్యాధికి గురై చికిత్స పొందినవారు, వ్యాధి సోకిన వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, 60ఏళ్లు పైబడినవారు. 18 కంటే ఎక్కువ బీఎంఐగలవారు. పొగ, మద్యం సేవించేవారు.

వీరు అనర్హులు

- 18 ఏళ్ల కన్నా తక్కువ వయస్సు కలవారు.
- గర్భిణులు లేదా బాలింతలు, హెచ్‌ఐవీ బాధితులు
- మూడు మాసాల్లో రక్తమార్పిడి చేసుకున్నవారు.
- క్షయవ్యాధికి మందులు వాడుతున్న వారు.
- బీసీజీ లేదా ఇతర వ్యాక్సిన్ వేసుకోని వారు.
- వ్యాక్సిన్ వేసుకోవడం ఇష్టం లేని వ్యక్తులు.

టీకాతో క్షయ నిర్మూలన సాధ్యం



పెద్దల బీసీజీ టీకా క్షయవ్యాధి నిర్మూలనకు ఉపయోగపడుతుంది. జిల్లా, మండల స్థాయిలో వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి టీకాపై శిక్షణ పూర్తయింది. గ్రామాల్లో ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటి సర్వే చేసి అర్హులను గుర్తించిన అనంతరం వ్యాక్సిన్ వేసే ప్రణాళిక ప్రారంభం అవుతుంది.

– ఎస్.శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

మీసేవ ద్వారా సభ్యత్వాలు వద్దు



ఆందోళన చేస్తున్న కార్మిక నాయకులు

జగిత్యాల: భవన నిర్మాణ రంగ కార్మికులకు మీసేవ ద్వారా సభ్యత్వాలు ఇవ్వడం ద్వారా నష్టాలు జరుగుతున్నాయని, వెంటనే రద్దు చేయాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘ నాయకులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. గతంలో కార్మికులకు లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా సభ్యత్వం ఇచ్చేదని, ఇప్పుడు కొందరు బ్రోకర్లుగా మారి సభ్యత్వం ఇప్పిస్తామని గ్రామాల్లో అమాయకులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వెల్ఫేర్ బోర్డు భవన కార్మిక రంగానికి చైర్మన్‌ను నియమించాలని, 2009 నుంచి సభ్యత్వం తీసుకున్న కార్మికులను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఐడీకార్డులు రెన్యూవల్ చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎనగందుల గంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జువెల్లరీ దుకాణంలో అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న స్థానికులు, పోలీసులు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన రాము అనే వ్యక్తి జువెల్లరీ దుకాణంలో గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు చెలరేగడంతో స్థానికులు, రుద్రంగి పోలీసులు మంటలార్పారు. పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్వల్పంగా ఫర్నీచర్ దగ్ధమైంది.

తొమ్మిది మందిపై కేసు

సారంగాపూర్: లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మహిళను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న భర్త శ్రవణ్‌తోపాటు అత్త, మామ, ఆడబిడ్డతో కలిపి మొత్తం తొమ్మిది మందిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన హారికకు వరంగల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎనమనగండ్ల శ్రవణ్‌తో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో హారిక తల్లిదండ్రులు ఒప్పుకున్న వరకట్నం శ్రవణ్‌కు ముట్టజెప్పారు. మూడు సంవత్సరాల నుంచి అదనంగా మరో రూ.5లక్షలు వరకట్నం కావాలని హారికను అత్తింటివారు వేధిస్తున్నారు. వేధింపులు భరించలేక హారిక సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త శ్రవణ్, అత్త పద్మ, మామ మల్లేశం, ఆడపడుచు రవళి, సుధాకర్(రవళి భర్త), శ్రవణ్ కుటుంబ సభ్యులు పంజర్ల లక్ష్మీ, లక్ష్మయ్య, మేనత్త సునీతతోపాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడ్డ హన్మంత్

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం భూక్యతండ గ్రామానికి చెందిన మాలోతు హన్మంత్ అనే గిరిజన రైతు తన పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. పిచ్చి కుక్క దాడి చేసింది. దీంతో ఆయన ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

పరస్పర దాడులు


ఇరువర్గాలను పంపిస్తున్న ఎస్సై

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోమవారం మండలంలోని ఒకే తండాకు చెందిన ఇరువర్గాల యువకుల మధ్య మాటామాట పెరిగి పరస్పర దాడులు చేసుకున్నారు. అక్కడ ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా.. స్థానిక ఎస్సై రమేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు. గొడవకు సంబంధించిన కారణాలపై ఆరా తీస్తున్నారు. గొడవకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

భయం..భయం

- అతివేగంతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు
- ఎక్కువ ట్రిప్పులు కొట్టాలని మితిమీరిన స్పీడ్
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్న జిల్లా ప్రజలు
- రోడ్లు ధ్వంసం.. కళ్ల ముందే ప్రమాదాలు
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు


మానేరు వాగులో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు(ఫైల్)


ఈ చిత్రం సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్‌లో రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం. కనుకుంట్ల నర్సయ్య అనే నేత కార్మికుడు సాంచాలు నడిపించేందుకు బీవైనగర్‌కు మోపెడ్‌పై కార్ఖానాకు వెళ్తుండగా.. మానేరు వాగు నుంచి ఇసుక తీసుకొస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.


ఇది సరిగ్గా ఏడాది క్రితం సిరిసిల్ల కోర్టు ఎదుటే ఉదయాన్నే పాతూరు రామేశ్వర్‌రెడ్డి కారును రెండు ఇసుక ట్రాక్టర్లు ఢీకొట్టాయి. కారులో ఉన్న ఇద్దరూ వ్యక్తులు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. అతివేగంతో రెండు ఇసుక ట్రాక్టర్ల బీభత్సానికి నిదర్శనం.


ఈ ఫొటో పదిహేను రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో ఇసుక ట్రాక్టర్లు వేగంగా వచ్చి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టగా.. నాలుగు స్తంభాలు విరిగిపడ్డాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదృష్టవశాత్తు కూలీలు ప్రాణాలతో బయటపడ్డారు.

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: ఇసుకాసురుల ధనదాహానికి సామాన్యులు బలవుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ట్రిప్పుల ఇసుక జారవేయాలన్న దురాశతో అతివేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అంతేకాకుండా డ్రైవర్లలో మైనర్లే ఎక్కువగా ఉండడం గమనించాల్సిన విషయం. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఇసుక ట్రాక్టర్ల బీభత్సంపై ‘సాక్షి’ ఫోకస్.

వేబిల్లు ఒకటి.. ట్రిప్పులు అనేకం

స్థానిక అవసరాల కోసం రెవెన్యూ అధికారులు మంగళ, శనివారాలు ఇసుక రవాణాకు అనుమతిస్తున్నారు. సిరిసిల్ల పట్టణం ఆదర్శనగర్‌లోని మానేరు వాగులో ఇసుక రీచ్ ఏర్పాటు చేయగా.. వందల సంఖ్యల ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోంది. ఒక ట్రాక్టర్‌కు రోజులో నాలుగు టోకెన్లు మాత్రమే అనుమతిస్తుండగా.. వారు కిందిస్థాయి సిబ్బందిని మభ్యపెట్టి పదుల సంఖ్యలో ట్రిప్పులు కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. తక్కువ కాలంలో ఎక్కువ ట్రిప్పుల ఇసుక జారవేయాలన్న ఆశతో అతివేగంతో వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇసుక కేసులు ఇలా..	
నమోదైన కేసులు:	151
సీజ్ చేసిన వాహనాలు:	151
రిమాండ్ వ్యక్తులు:	08
ప్రమాదంలో మృతులు:	01

ఫిర్యాదులు బుట్టదాఖలు

ట్రాక్టర్ల యజమానులు అనుమతికి మించి ఇసుక ట్రిప్పులు కొడుతున్నారని రెండేళ్లుగా సిరిసిల్ల రెవెన్యూ, పోలీస్, కలెక్టర్ ఆఫీసుల్లో పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్ల రణగొనధ్వనులతో ఇబ్బందులు పడుతున్నామని సాయినగర్వాసులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే వారు లేరు. ఫిర్యాదు కాగితాలను చెత్త బుట్టల్లో వేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్థానికుల అభ్యంతరాలు ఇవీ..

- అతివేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగాన్ని నియంత్రించాలి.
- ఉదయం 5 గంటల నుంచే ఇసుక రవాణా మొదలవుతోంది. పొద్దున్నే బయటకు వచ్చేందుకు భయపడుతున్నాం.
- ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండడంతో రోడ్డుపై దుమ్ము లేచి ఇళ్లలోకి వస్తోంది.
- రోడ్లు పాడయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.
- అతివేగంగా వెళ్లొద్దని ట్రాక్టర్లను అడ్డుకుంటే.. తమపైకే వాటిని తీసుకొస్తున్నారని ఆరోపిస్తున్నారు.

నా కారును ఢీకొట్టి బెదిరించారు


గతేడాది కారులో ఇంటి నుంచి వస్తుంటే స్పీడ్‌గా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఇదేందని అడిగితే జవాన్ అయిన నన్నే ఇక్కడేం పని అంటూ బెదిరించారు. నా కారు రిపేరుకు రూ.25వేలు ఖర్చైంది. ఇంక కొంచెం ఏదైనా జరిగితే నా ప్రాణం పోయేది.
– మాలోతు విష్ణువర్ధన్, కానిస్టేబుల్

ఇసుక రీచ్ ఎత్తేయాలి


ఇక్కడ ఇసుక రీచ్ పెట్టినప్పుడు పెద్దగా ఇళ్లు లేవు. ఇప్పుడు కాలనీలు వెలిశాయి. వేల మంది నివసిస్తున్నారు. పిల్లలు, పెద్దలు ఇంటి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇసుక రీచ్‌ను ఎత్తేయాలని ఎన్నోసార్లు కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకు విన్నవించాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.
– కుందెన విష్ణు, ఆదర్శనగర్

వాహనాలు సీజ్ చేస్తాం


రీచ్ నుంచి ఇసుకను తీసుకెళ్లే క్రమంలో నిబంధనలు పాటించాలి. ఇందుకు మా సిబ్బందికి కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చాం. డ్రైవింగ్ లైసెన్సు లేని వారు ట్రాక్టర్లు నడపొద్దు. ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీకి వేర్వేరుగా నంబరు ప్లేట్లు ఉండాలి. వేగ నియంత్రణ పాటించకుంటే వాహనాలను సీజ్ చేస్తాం. – అఖిల్ మహాజన్, ఎస్పీ

మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం


పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ వైన్స్ వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న దృశ్యమిది. డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ వైన్స్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉదయం తెరిచిన దగ్గరి నుంచి రాత్రి మూసేవరకు ఈ తతంగం నడుస్తూనే ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం గుండా వెళ్లడానికి ప్రజలు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యతో గతంలో వైన్సును ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు ఆందోళన చేశారు. కానీ అధికారులు పట్టించుకోలేదు. వైన్సును తొలగించకపోయినా.. కనీసం బహిరంగంగా మద్యం తాగడాన్ని కూడా నియంత్రించడం లేదు. ప్రజల ఇబ్బందిని అటు పోలీసులు.. ఇటు ఎక్సైజ్ అధికారులు మామూలుగా తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- వైన్సుల వద్దే బహిరంగంగా తాగుతున్న మందుబాబులు
- పలుచోట్ల ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు, వాటర్ బాటిళ్ల విక్రయం
- ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

చర్యలు తీసుకుంటాం

ఎక్కడైనా వైన్సుల వద్ద బహిరంగంగా మద్యం తాగితే మా దృష్టికి తీసుకురావాలి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రతి వ్యాపారి తప్పనిసరిగా నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలి.
– వినోద్ రాథోడ్, ఎక్సైజ్ సీఐ, మెట్‌పల్లి

మెట్‌పల్లి: జిల్లాలో చాలాచోట్ల మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దుకాణాల నిర్వహణ విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన వ్యాపారులు.. అధికారుల అండతో వాటిని బేఖాతరు చేస్తున్నారు. దుకాణాల్లో కేవలం మద్యం మాత్రమే విక్రయించాల్సి ఉండగా.. వాటర్ బాటిళ్లు, ఆహార పదార్థాలు సైతం అమ్ముతున్నారు. దీనికి తోడు మందుబాబులు దుకాణాల ఆవరణలోనే బహిరంగంగా మద్యం తాగడాన్ని ప్రోత్సహిస్తున్నారు.

పర్మిట్ రూంల అవకాశమున్నా..

మద్యం తాగేందుకు దుకాణాల వద్ద ప్రత్యేకంగా పర్మిట్ రూంలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. కొందరు వ్యాపారులు వీటిని ఏర్పాటు చేసుకోగా.. మరికొందరు మాత్రం విముఖత చూపుతున్నారు. పర్మిట్ రూం లేని దుకాణాల వద్ద మందుబాబులు బహిరంగంగా మద్యం తాగుతున్నారు. తమ అమ్మకాల పెంపు కోసం వ్యాపారులూ దీనిని ప్రోత్సహిస్తుండడం స్థానికులకు ఇబ్బందిగా మారింది. వీటిని అరికట్టాలని ఫిర్యాదులు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయం 8 గంటలకే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్సులు, బార్లను ఉదయం పది గంటలకు తెరిచి రాత్రి పది గంటలకు మూసివేయాలి. కానీ కొన్ని బార్లలో ఉదయం ఎనిమిది గంటలకే మద్యం విక్రయిస్తున్నారు. కూలి పని చేసుకునే వారిని లక్ష్యంగా చేసుకొని వ్యాపారులు ఇలా నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నారు.

బీర్లన్నీ బెల్టు దుకాణాలకే..

వేసవిలో బీర్ల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు అధిక లాభం కోసం వాటిని వైన్సుల్లో అమ్మకుండా బెల్టు దుకాణాలకు తరలిస్తున్నారు. వైన్సుల్లో కూలింగ్ ఖర్చుతో పాటు ఎమ్మార్పీ ధరకు వాటిని అమ్మాల్సి ఉంటుంది. దీంతో అలా చేయకుండా ఒక్కో బీరును అదనంగా రూ.10కి బెల్టు దుకాణాలకు అమ్ముతూ వైన్సుకు వచ్చే మందుబాబులను నిరాశకు గురి చేస్తున్నారు.

మామూలుగా తీసుకుంటున్న అధికారులు

పలువురు మద్యం వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. వైన్సుల వద్ద బహిరంగంగా మద్యం తాగడంతో.. చాలాచోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యాపారులు ఇచ్చే మామూళ్ల వల్లే వారు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రయాణికులపై తేనెటీగల దాడి


తేనెటీగల భయంతో చద్దరు కప్పుకొని వెళ్తున్న యువకుడు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రావి చెట్టుపై ఉన్న తేనెటీగలు ప్రయాణికులపై సోమవారం దాడి చేశాయి. వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై ఉన్న రావి చెట్టుపై తేనెటీగలు రెండు రోజులుగా ఇదే ప్రాంతంలో స్వైర విహారం చేస్తున్నాయి. ఇటుగా వెళ్లిన హీర్లం వెంకటేశం, అట్టపెల్లి భూమయ్య, పెరమాడ్ల తిరుపతి, ఎండీ మోసిన్, మెడిశెట్టి మధుతోపాటు 50 మందిపై దాడి చేశాయి. విషయం తెలుసుకున్న స్థానికులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా.. తామేమి చేయలేమని చెప్పారు. మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ ఆధ్వర్యంలో తేనెటీగల తెట్టెను చెట్టుపై నుంచి తొలగించాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రాన్ని సమర్పించారు.

అమ్మిన ప్రభుత్వ భూమిపై విచారణ జరపాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 24, 25, 26లో సుమారు ఐదెకరాల భూమి ఉండగా.. అది ధూప దీప నైవేద్యం కింద అర్చకులకు ఇనాంగా ప్రభుత్వం ఇచ్చింది. అట్టి భూమిని కొందరు రియల్టర్లు ప్లాట్లుగా పెట్టి అమ్మగా.. ఈ భూమి వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని సిరిసిల్ల ఆర్డీవోను జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ భూమి అమ్మకంపై గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన అదనపు కలెక్టర్ సదరు భూమిపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి వెంటనే భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. స్థానిక కేసీఆర్‌కాలనీ వద్ద సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా.. బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు.

గంభీరావుపేట విద్యార్థినికి గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకుంటున్న శ్రీహర్ష

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన చిలుక శ్రీహర్ష సోమవారం గోల్డ్ మెడల్ అందుకుంది. బీటెక్(ఫుడ్ అండ్ టెక్నాలజీ)లో అత్యుత్తమ ప్రతిభకు గాను జయశంకర్ విశ్వవిద్యాలయం వారు గోల్డ్ మెడల్ అందించారు. శ్రీహర్షను స్థానికులు అభినందించారు.

ఎన్‌హెచ్‌ఎం కార్యవర్గం ఎన్నిక


పద్మ


మహేశ్

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ తెలిపారు. జగిత్యాల జిల్లా అధ్యక్షురాలిగా బాలె పద్మ, గౌరవ అధ్యక్షుడిగా వెన్న మహేశ్, చీఫ్ అడ్వయిజర్‌గా రాములు, ప్రధాన కార్యదర్శిగా మాధురి ఎన్నికయ్యారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడు సంవత్సరాల శిక్షణ పొందేందుకు 2024–25 సంవత్సరంలో 8 మంది షెడ్యూల్డ్ కులాల లా పట్టభద్రుల ఎంపికకు ఉమ్మడి జిల్లాలో నివాసులైన అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 6 నుంచి వచ్చేనెల 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన లా పట్టభద్రులకు నెలకు రూ.3వేల స్టయిఫండ్‌తోపాటు ఫర్నీచర్ కోసం రూ.50వేలు మంజూరవుతాయని చెప్పారు.

వ్యక్తికి మూడేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించారు. పట్టణ సీఐ బి.రఘుపతి వివరాల ప్రకారం.. ఏడాది క్రితం పట్టణానికి చెందిన ఓ పదేళ్ల బాలిక ఒంటరిగా తన ఇంటికెళ్తున్న సమయంలో రాజీవ్‌నగర్‌కు చెందిన కొండ రాహుల్ ఆమెపై లైంగిక దాడి యత్నించాడు. తప్పించుకున్న బాలిక ఇంటికెళ్లి తాతకు వివరించింది. బాలిక తల్లి ఫిర్యాదుతో అప్పటి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ పెంట శ్రీనివాస్ వాదించగా.. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు మహేందర్, నరేందర్ 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి కారాగార శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్


మాట్లాడుతున్న భూపాల్

వేములవాడఅర్బన్: రాజ్యంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి నేటితరం యువత నడుం బిగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ పేర్కొన్నారు. వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీపీఎం శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. భూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ సర్కార్ పదేళ్లుగా అధికారంలో ఉండి దేశ ప్రజలకు మేలు చేయలేదన్నారు. తమను ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తూ అనేకమంది హేతువాదులు, జర్నలిస్టులు, మేధావులను పొట్టన పెట్టుకుందని పేర్కొన్నారు. మత విద్వేషాలు నింపుకున్న ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో బీజేపీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను పేదలకు అందకుండా చేయాలనే దురుద్దేశంతో పని చేస్తోందని విమర్శించారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని హత్తుకొని ముద్దాడుతూ దానిపై కపట ప్రేమ చూపారని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, ముత్యం రావు, జవ్వాజి విమల, నర్సయ్య, నాగరాజు, రమణ, శ్రీధర్, పద్మ, ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో రంగు మారిన బియ్యం


నాసిరకం బియ్యం

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలవ్యాప్తంగా నాసిరకం రేషన్ బియ్యం పంపిణీతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. సన్న బియ్యం సంగతి దేవుడెరుగు.. ఉన్న బియ్యం కూడా బాగా లేవని వాపోతున్నారు. గత నెలలో అందజేసిన రేషన్ బియ్యం నాసిరకంగా, రంగు మారి ఉండి వండడానికి, తినడానికి వీల్లేకుండా ఉన్నాయని వినియోగదారులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిపారు. గోవిందారం ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమా జూన్ 6న జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. అయినా అధికారుల తీరు మారడం లేదు. ఈ నెలలో వినియోగదారులకు అందిస్తున్న బియ్యం కూడా నాసిరకంగా, ఉండలు కట్టి, రంగు మారి, వండడానికి, తినడానికి వీల్లేకుండా ఉన్నాయని వాపోతున్నారు. ఈ బియ్యం తింటే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, కడుపు నొప్పి, విరేచనాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు అన్నం వాసన వస్తోందని, మెత్తగా అవ్వడంతో తినటం లేదని అన్నారు. మేడిపల్లి మండలవ్యాప్తంగా సుమారు 9,731 కార్డులుండగా.. ప్రతి నెల సుమారు 1,70,132 కిలోల బియ్యం అందజేస్తున్నారు. భీమారం మండలవ్యాప్తంగా సుమారు 7,338 కార్డులుండగా.. సుమారు 1,26,443 కిలోల బియ్యం అందజేస్తున్నారు.

కొత్తపల్లి విద్యార్థులకు వందేమాతరం పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

గంభీరావుపేట: పదోతరగతిలో పదికి పది జీపీఏ సాధించిన కొత్తపల్లి విద్యార్థులు వందేమాతరం ప్రతిభా పురస్కారాలను సోమవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మాటామంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న శివలాస్య, ప్రహర్ష, సౌజన్య, శశాంక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌ను స్థానికులు అభినందించారు.

ఇసుక డంపులపై ఉక్కుపాదం


ఇసుక డంపులను సీజ్ చేసిన అధికారులు

ధర్మపురి: అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక డంపులపై అధికారులు ఉక్కుపాదం మోపి సుమారు రూ.6లక్షల విలువ గల డంపులను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పజెప్పారు. రాయపట్నం గ్రామంలో రూ.లక్షల విలువ చేసే ఇసుక డంపులున్నాయని అధికారులకు సమాచారమందింది. సోమవారం మైనింగ్ డిపార్టుమెంట్ అధికారి తిరుపతిరావ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి ఇసుక డంపులపై దాడులు చేశారు. గ్రామంలోని చెట్ల పొదలు, గోదావరి ఒడ్డున, రహస్య ప్రదేశాల్లో నిలువ ఉంచిన డంపులపై పోలీసులు దాడులు చేసి వాటిని స్వాధీనపర్చుకొని రెవెన్యూ అధికారులకు అప్పజెప్పారు. అధికారులు మాట్లాడుతూ.. రాయపట్నం వద్ద ఎల్లంపెల్లి బ్యాకు వాటర్ తగ్గుముఖం పట్టడంతో ఇసుక మేటలు తేలి ఇసుకాసురులకు వరంగా మారిందన్నారు. రాత్రిపూట ట్రాక్టర్ల ద్వారా గోదావరి నుంచి ఇసుకను తోడి రహస్య ప్రదేశాల్లో డంపులుగా పోసుకున్నారని అన్నారు. రాయపట్నంలో నిత్యం మూడు పువ్వు లు, ఆరు కాయలుగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందన్నారు. దాడులు చేసి డంపులను సీజ్ చేశామని మైనింగ్ అధికారి తిరుపతిరావ్ తెలిపారు.

రాజన్న దర్శనానికి నాలుగు గంటలు


ఆలయంలో భక్తులు

- వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం ఒక్కో భక్తుడికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు, అభిషేకాలు, అన్నపూజలు రద్దు చేశారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


కోడెమొక్కు చెల్లించుకుంటూ..